విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్ కమిటీలు

- గంజాయి సాగు చేస్తే భూమి జప్తు
- కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 31: యువత డ్రగ్స్ మహమ్మారి బారిన పడకుండా కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. బుధవారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి నార్కోటిక్ కోఆర్డినేటర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. విద్యా సంస్థల్లో యాంటీ డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. విద్యాలయాల వద్ద 100 మీటర్ల పరిధిలో ఎలాంటి పాన్‌షాప్‌లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు ఉండటానికి వీల్లేదని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో నెలవారి పేరెంట్ టీచర్ మీటింగ్‌లలో డ్రగ్ నిర్మూలనపై చర్చించాలన్నారు. రైతులు ఎవరైనా గంజాయి సాగుచేసినా, అంతర పంటగా వేసినా ఆ భూమిని జప్తు చేస్తామని హెచ్చరించారు. జిల్లా పోలీసు కంట్రోల్ రూం. నం.8712659360కు సమాచారం అందించాలని ఎస్పీ డి.జానకి ప్రజలకు సూచించారు. సమావేశంలో ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ విజయభాస్కర్‌రెడ్డి, ఐసీడీఎస్ అధికారి జరీనాబేగం, డీఎస్పీ వెంకటేశ్వర్లు, డీఎస్పీ రమణారెడ్డి, పాల్గొన్నారు.

నిస్వార్థసేవతోనే గుర్తింపు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 31: ఉద్యోగ జీవితంలో నిస్వార్థంగా, నిజాయితీగా నిరుపేదలకు అందించిన సేవలకు చిరస్థాయిగా గుర్తింపు లభిస్తుందని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. జిల్లా పరిశ్రమల శాఖ మేనేజరుగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన వి.బాబురావు పదవీ విరమణ సన్మానోత్స కార్యక్రమాన్ని బుధవారం మయూరి పార్కు సమావేశ మందిరంలో నిర్వహించారు. కార్యక్రమాల్లో గోనెమోహన్, ఆర్.శ్రీనివాసమూర్తి, చేనేత శాఖ ఏడీ బాబు, లీడ్ బ్యాంకు మేనేజర్ కల్వభాస్కర్, సమాచారశాఖ డిప్యూటీ ఈఈ ఇస్రా, డీవైఎస్‌వో శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

తల్లిపాల సంస్కృతిని ప్రోత్సహిద్దాం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 31: అంతరాలను పూరించి-తల్లిపాల సంస్కృతిని పోత్సహిద్దామని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. ఆగస్టు మొదటి వారం నిర్వహించే ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు-2024 పోస్టర్‌ను బుధవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. తల్లిపాల వల్ల కుటుంబానికి, తల్లులకు, పిల్లలకు, దేశానికి కలిగే ప్రయోజనాలపై ప్రజలకు విస్తృత స్థాయిలో ప్రచారం అవగాహన కల్పించాలని సూచించారు.

బ్రిడ్జి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

- పాతపాలమూరులో పనులు పరిశీలించిన మాజీ మంత్రి

అధికారులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, జూలై 31: జిల్లా కేంద్రం పాతపాలమూరు బ్రిడ్జి నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని మాజీమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ సంబంధిత అధికారులను కోరారు. బుధవారం మహబూబ్‌నగర్-భూత్పూర్ ప్రధాన రహదారిలో బ్రిడ్జి పనులను పరిశీలించారు. బీఆర్‌ఎస్ హయాంలోనే ప్రారంభించి ఒకవైపు నిర్మించామన్నారు. ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, పనులు పూర్తిచేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు.

విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి

మాట్లాడుతున్న న్యాయమూర్తి మహమ్మద్ ముదాసిర్

- న్యాయమూర్తి మహ్మద్ ముదాసిర్

జడ్చర్ల, జూలై 31: విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని జడ్చర్ల అడిషనల్ కోర్టు న్యాయమూర్తి మహమ్మద్ ముదాసిర్ సూచించారు. బుధవారం జడ్చర్ల మండలం మాచారం శివారులోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలలో మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఎంతో కష్టపడి తమ పిల్లలను చదువుల కోసం విద్యాలయాలకు పంపుతున్నారని, విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. జడ్చర్ల బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు కొంకల జంగయ్య మాట్లాడుతూ బంగారు భవిష్యత్ ఉన్న విద్యార్థులు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే మీతోపాటు కుటుంబసభ్యులు కూడా కేసులతో కోర్టుల చుట్టూ, పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరగాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, ఎస్సై శివానందం, న్యాయవాదులు రాములు, పాండు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ కార్యాలయాన్ని ఆక్రమించుకుని నిర్మాణాలు

బాలానగర్, జూలై 31: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వెనుక వైపు కార్యాలయానికి సంబంధించిన ప్రహరీపైనే ఏకంగా నిర్మాణం పనులు చేస్తుండగా.. మరో వైపు సమావేశ మందిరం వెనుక వైపున కూలిన ప్రహరీని ఆక్రమించుకుని కార్యాలయం లోపలికి వచ్చేవిధంగా గేటు ఏర్పాటు చేసుకు ని పనులు చేస్తున్నారు. గ తంలో పనిచేసి న అధికారుల, స్థానిక పె ద్దల సహకారంతోనే నిర్మాణాలు చే స్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై ఇన్‌ఛార్జి ఎంపీడీవో విజయకుమారి, సూపరింటెండెంట్ శ్రీనివాసరావును సంప్రదించగా కార్యదర్శితో మాట్లాడామని, ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకుని ఇంటినిర్మాణాలు చేస్తున్న వారికి నోటీసులు ఇవ్వాలన్నారు.

రేషన్‌కార్డు నిబంధన లేకుండా మాఫీచేయాలి

మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

దామరగిద్ద, జూలై 31: రేషన్‌కార్డు నిబంధన లేకుండానే రైతులందరికీ రుణమాఫీ చేయాలని సీపీఐ మండల నాయకులు సాయికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని ఎస్‌బీఐ వద్ద రైతులతో మాట్లాడుతూ రుణమాఫీ ప్రక్రియలో ఒకరేషన్ కార్డుకి ఒక్కరే, పేర్లు ఒకేరకంగా లేకుంటే రాదు అంటూ నిబంధనలు పెట్టడంతో రైతులు చాలా మంది నష్టపోతున్నారని అన్నారు. వివరాలన్నీ సరిగా ఉంటేనే రైతులకు రుణాలు ఇచ్చిన బ్యాంకు అధికారులు, మాఫీ చేసేటప్పుడు ఎందుకు ఇబ్బందిపెడుతున్నారని ప్రశ్నించారు. ఇకనైనా ముఖ్యమంత్రి కల్పించుకుని నిబంధనలు లేకుండా మాఫీ ప్రక్రియ సాగించాలని, లేదంటే పెద్దఎత్తున ఆందోళన చేయాల్సి వస్తుందన్నా రు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కృష్ణయ్య, మండల నాయకులు బాలరాజు, తాయప్ప పాల్గొన్నారు.

పండ్లతోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఊట్కూర్, జూలై 31: ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల పెంపకం కోసం ఆసక్తి ఉన్న చిన్న, సన్నకారు రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో ధనుంజయగౌడ్ బుధవారం ప్రకటనలో తెలిపారు. రైతులు మామిడి, బత్తాయి, జామ, నిమ్మ, కొబ్బరి, మునగ, ఈత వంటి తోటలు పెట్టేందుకు అవకాశం ఉందని, తోటల పెంపకం కోసం రైతులకు బోరు లేక బావిద్వారా నీటి వసతి తప్పనిసరిగా ఉండాలని, మామిడి, బత్తాయి, జామ, నిమ్మకు మూడేండ్ల వరకు, కొబ్బరి, ఈత, డ్రాగన్ ఫ్రూట్ రెండేండ్ల వరకు, మునగకు ఏడాది మెయింటెనెన్స్ ఉంటుందని తెలిపారు. సంబంధిత కార్యదర్శి, టీఏకు దరఖాస్తు అందజేయాలని తెలిపారు.

మెరుగైన వైద్యసేవలందిస్తా

సూపరింటెండెంట్ సందీప్‌కుమార్ సింగ్

మహబూబ్‌నగర్, జూలై 31: పేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తానని మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ సందీప్ కుమార్‌సింగ్ అన్నారు. పాలమూరు జిల్లా వాసిగా పేదలకు వైద్య సేవలు అందించేందుకు జిల్లాకు వచ్చానన్నారు. తన తండ్రి గోపాల్ సింగ్ ఇదే దవాఖానలో ఈఎన్‌టీ పనిచేశారన్నారు.

ప్రకటన

నా క్లయింట్ అయిన జెక్కని యాదమ్మ W/o పెంటయ్య నివాసము తంగెళ్ళపల్లి, కొందురు మండలం, ప్రస్తుతము రంగారెడ్డి జిల్లా మరియు తన సొంత చెల్లెండ్లు అయిన మైసమ్మ, చెన్నమ్మ, జంగమ్మ, కె.సత్యమ్మ, చంద్రకళ, లక్ష్మి నరసమ్మ మరియు మంజుల గార్లు అనగా చిన్న పెంటయ్య S/o చంద్రయ్య గారి కుమార్తెలు వీరి యొక్క పెద్దల నుండి వచ్చిన తండ్రి భూమి సర్వే నంబరు 66 విస్తీర్ణము ఎ.6-38 గుంIIలు గ్రామము కొల్లూర్, మండలము నవాబ్‌పేట, జిల్లా మహబూబ్‌నగర్ విషయంలో గౌరవ జూనియర్ సివిల్ జడ్జి, మహబూబ్‌నగర్ గారి కోర్టు నందు భాగపరిష్కారాలు చేసి తమ భాగము ఇప్పించుటకు కేసు అనగా OS.No. 288/2021, 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి మహబూబ్‌నగర్‌లో కేసు వేసినారు. ఇట్టి కేసు తదుపరి విచారణ గురించి తేది: 09-08-2024న ఉన్నది. ఇట్టి కేసు మా క్లయింట్స్ యొక్క పాలివారు అయిన జెక్కని రాములు, జెక్కని బాల్‌రాజ్, జెక్కని పెంటయ్య, జెక్కని యాదయ్య మరియు జెక్కని యాదమ్మ అందరి తండ్రి కిష్టయ్య, అందరి నివాసము కొల్లూర్ గ్రామము. మండలం నవాబ్‌పేట గార్లు మరియు ఇతరులు లంబ శ్రీనివాసులు S/o నర్సిములు, కంకంటి చంద్రశేఖర్ S/o కృష్ణయ్య మరియు MD.ఖాజా S/o పీర్ సాబ్ గారు తమ పేర ఉన్న తప్పుడు పట్టా ఆధారంగా ఇతరులకు అమ్మాలని ప్రయత్నము చేస్తున్నట్లు తెలిసినది.

కావున పై తెలిపిన భూమిని ఎవ్వరేగానీ కొన్నా లేదా ఇతరత్రా లావాదేవీలు నడిపిన చట్టపరంగా చెల్లుబాటు కావు. ఇందుకు విరుద్ధంగా ఎవ్వరేగాని క్రయ, విక్రయాలు లేదా ఇతరత్రా లావాదేవీలు చేసినా మాచే తీసుకొనే చట్టపరమైన క్రిమినల్ మరియు సివిల్ కేసులకు బాధ్యులు కాగలరు.

K. ANAD RAO B.Com., LL.B.,
ADVOCATE, # 1-2-123/3/C, Station Road
Mahabubnagar. Cell: 9441016518

నవాబుపేట ఎంపీడీవోగా జయరాంనాయక్

నవాబ్‌పేట, జూలై31: నవాబ్‌పేట ఎంపీడీవోగా జయరాంనాయక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న శ్రీలత హైదరాబాద్‌కు బదిలీ అయ్యారు. మద్దూర్ ఎంపీడీవోగా పనిచేస్తున్న జయరామ్‌నాయక్ బదిలీపై నవాబ్‌పేటకు వచ్చారు.

ఎంపీడీవోగా విజయకుమార్

జడ్చర్ల, జూలై 31: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా విజయకుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ ఎంపీడీవోగా పనిచేస్తూ బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా జడ్చర్ల కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

వేధింపులకు గురైతే భరోసా కేంద్రాన్ని ఆశ్రయించాలి

భరోసా కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ యోగేశ్ గౌతమ్

- ఎస్పీ యోగేశ్ గౌతమ్

నారాయణపేట ఎస్పీ యోగేశ్ గౌతమ్

నారాయణపేట, జూలై 31: మహిళలు పబ్లిక్, ప్రైవేటు ప్రదేశాలు, కుటుంబంలో, కార్యాలయాలలో వేధింపులకు గురైతే భరోసా కేంద్రాన్ని ఆశ్రయించాలని ఎస్పీ యోగేశ్ గౌతమ్ చెప్పారు. బుధవారం పట్టణంలోని భరోసా కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సెంటర్‌లో సభ్యులను కౌన్సెలింగ్ చేయు విధానం, రికార్డు అప్‌డేట్ విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు పోక్సో, రేప్ కేసులకు సంబంధించి మొత్తం 36మంది బాధితులకు కౌన్సెలింగ్ ఇచ్చామని, 16మంది బాధితులకు పరిహారం కోసం పంపామన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే రేప్, పోక్సో కేసులకు సంబంధించి స్టేట్‌మెంట్ రికార్డు చేస్తామన్నారు. లైంగిక వేధింపులు ఎదుర్కొన్న బాధిత మహిళలకు భరోసా ప్రత్యేక సేవలు అందిస్తారన్నారు. భరోసా కేంద్రంలో 24గంటల పాటు మహిళా పోలీసులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఆపదలో ఉన్న మహిళలకు అత్యాచారానికి గురైన వారికి, చిన్నారులకు భరోసా కేంద్రం ద్వారా సరైన సమయంలో రక్షణ, వైద్య, న్యాయ సహాయం అందిస్తూ నిందితులకు కోర్టులో శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో భరోసా సెంటర్ ఇన్‌చార్జి ఎస్సై సునీత, కౌన్సిలర్ అండ్ కోఆర్డినేటర్ ప్రమీల, సపోర్ట్ పర్సన్ దేవి, రిసెప్షనిస్ట్ రాధిక పాల్గొన్నారు.

పోలీసు అధికారికి సన్మానం

మహబూబ్‌నగర్, జూలై 31: పదవీ విరమణ పొందిన బి.మోహన్ ఏఆర్‌ఎస్సైని ఎస్పీ జానకి ఘనంగా సన్మానించారు. బుధవారం తన కార్యాలయంలో ప్రశంసా పత్రం అందజేసి అభినందించారు. అనంతరం మాట్లాడుతూ భవిష్యత్‌లో ఏ విధమైన సహాయం కావాలన్నా వెంటనే తమను సంప్రదించాలని చెప్పారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి, ఏవో రుక్మిణీబాయి, ఎస్పీ సీసీరాంరెడ్డి, ఆర్ఐ శ్రీను, ఆర్ఐ కృష్ణయ్య పాల్గొన్నారు.

కాన్పులు ప్రభుత్వ దవాఖానలో జరగాలి

- డీఎంహెచ్‌వో కృష్ణ

భూత్పూర్, జూలై 31 : ప్రసవాలు ప్రభుత్వ దవాఖానలో జరగాలని జిల్లా వైద్యాధికారి కృష్ణ కోరారు. బుధవారం మండలంలోని తాటిపర్తి సబ్‌సెంటర్‌కు ఆకస్మికంగా వచ్చారు. ఈ సందర్భంగా వ్యాక్సినేషన్‌ను పరిశీలించారు. రికార్డులను, బాలింతల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం ఈ సీజన్‌లో ప్రతిఒక్కరూ పారిశుధ్యంపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రైవేట్ ఆసుపత్రులలో కాన్పులు జరిగితే ఏఎన్‌ఎంలపై, ఆశ వర్కర్లపై కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి అబ్దుల్‌రబ్బు, సీహెచ్‌వో అయూబ్‌ఖాన్, ఏఎన్ఎం రజిత, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్యాడ్ల వితరణ

దేవరకద్ర రూరల్(కౌకుంట్ల), జూలై 31 : కౌకుంట్ల మండలం పేరూర్ గ్రామానికి చెందిన కౌసల్య జెడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, నోటు పుస్తకాలు, పెన్నులు వితరణ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పద్మ, అరవింద్‌కుమార్ రెడ్డి, మాజీ సర్పంచ్ చామన్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మద్యంతాగి వాహనాలు నడపరాదు

కృష్ణ, జూలై 31: ఎస్పీ ఈదేశాల మేరకు మండలంలోని కృష్ణ సరిహద్దు చెక్‌పోస్టు వద్ద నేషనల్ హైవేపై ఎస్సై ఎండీ నవీద్ ఆధ్వర్యంలో బుధవారం పోలీస్ సిబ్బంది వాహనాలను తనిఖీ చేశారు. మద్యం తాగివాహనాలు నడపరాదని, వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. ప్రజలు అత్యవసర సమయంలో డయల్ 100కు కాల్ చేసి పోలీసులుకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

విద్యార్థికి అభినందనలు

జడ్చర్ల, జూలై 31: హర్యానా రాష్ట్రంలో జూలై 25నుంచి 28వరకు జరిగిన 42వ జాతీయస్థాయి సీనియర్ నెట్‌బాల్ క్రీడా పోటీల్లో తెలంగాణ రాష్ట్ర జట్టులో జడ్చర్ల మైనారిటీ గురుకుల విద్యార్థి జె.జశ్వంత్ పాల్గొన్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పారిజాత తెలిపారు. తెలంగాణ రాష్ట్రజట్టు ద్వితీయ స్థానంలో నిలిచిందని, ఉత్తమ ప్రతిభ కనబరిచిన జశ్వంత్‌ను ఉమ్మడి మహబూబ్‌నగర్ మైనారిటీ గురుకులాల ప్రాంతీయ సమన్వయకర్త ఖాజాబాహోద్దీన్, అకాడమిక్ కోఆర్డినేటర్‌లు ఎండి.జహిరుద్దిన్, సలీముద్దిన్, ప్రిన్సిపాల్ పారిజాత, ఉపాధ్యాయులు అభినందించారు.

కళాశాలలో మధ్యాహ్న భోజనం పెట్టాలి

తాసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

దామరగిద్ద, జూలై 31: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం అమలు చేయాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ నాయకుడు సాయికుమార్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం విద్యారంగాన్ని గాలికి వదిలేసిందని, ఎన్నికల మేనిఫెస్టోలో విద్యారంగం బలోపేతానికి అనేక రకాల హామీలు ఇచ్చినా నేటికీ అమలుకు నోచుకోలేదన్నారు. 8వేల కోట్ల పైచిలుకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు చెల్లించాల్సి ఉందని, వెంటనే విడుదల చేయాలని అన్నారు. అనంతరం తాసీల్దార్ రాములుకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో గౌస్, విజయ్, బాల్‌రాజ్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రబడ్జెట్‌ను సవరించాలి

బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

నారాయణపేట టౌన్, జూలై 31: రైతాంగాన్ని మోసగించిన కేంద్ర బడ్జెట్‌ను సవరించి వ్యవసాయ రంగానికి అధిక నిధులు కేటాయించాలని ఏఐకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి కాశీనాథ్ డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా కేంద్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం పట్టణంలోని సత్యనారాయణ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్రామిరెడ్డి, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిలయ్యగౌడ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, ఏఐకేఎస్ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణ పాల్గొన్నారు.

యానగొంది మౌలాలికి దోస్తీరహాదీన్

దేవరకద్ర రూరల్(కౌకుంట్ల), జూలై 31 : కౌకుంట్లలో కొడిపీర్లు అయిన యానగొంది మౌలాలి ఉత్సవాలు ప్రారంభం కావడంతో, పీరును కొత్త దట్టీలతో అలంకరించారు. భక్తులు పీర్లకు కందూర్లు చేసి, ఫాతెహాలు ఇచ్చి మొక్కులు తీర్చుకుంటారు. గురువారం రాత్రి పీర్లను బావికి పంపించడంతో ఉత్సవాలు ముగుస్తాయి.

డివైడర్‌ను ఢీ కొట్టిన తూఫాన్


దూసుకెళ్లిన తూఫాన్ హనం

మూసాపేట, జూలై 31 : తూఫాన్ వాహనం డివైడర్‌ను ఢీ కొట్టిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి కర్నూల్ వైపు తూఫాన్ వాహనం 15 మందితో బయలుదేరింది. మార్గమధ్యలో మండలంలోని జానంపేట చక్రాపూర్ స్టేజి పీహెచ్‌సీ సమీపంలోకి రాగానే ఆకస్మాత్తుగా ఆ వాహనానికి ఓ కుక్క అడ్డు వచ్చినట్లు, ఆ కుక్కను తప్పించబోవడంతో తుఫాన్ వాహనం రోడ్డుమధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొని పైకి ఒకభాగం టైర్లు వెళ్లాయి. వాహనం వేగంగా ఉండడంతో ముందుకు దూసుకెళ్లి ఆటు వైపు ఉన్న రోడ్డుపైకి వెళ్ళింది. దీంతో రెండు టైర్లు పగిలి పోయాయి. వాహనంలో ఉన్నఇద్దరికి గాయాలు కావడంతో స్థానికులు పక్కనే ఉన్న పీహెచ్‌సీలో వైద్యం చేయించారు. ఎదురుగా అటువైపు నుంచి మరోవాహనం వచ్చి ఉంటే పెనుప్రమాదం జరిగే అవకాశం ఉండేది. ఎలాంటి వాహనాలు రాకపోడంతో పిల్లలు, పెద్దలు అందరూ స్వల్ప గాయాలతో బతికి బయటపడ్డారు. కానీ వాహనాన్ని డ్రైవర్ అప్రమత్తతోనే వాహనం బోల్తాపడకుండా ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

పట్నంలో రాణిస్తున్న పాలమూరు క్రీడాకారులు



పాలమూరు క్రీడాకారులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 31: హైదరాబాద్ క్రికెట్ సంఘం(హెచ్‌సీఏ) త్రీడే లీగ్ టోర్నీ రెండో మ్యాచ్‌లో ఉమ్మడి పాలమూరు జిల్లా క్రీడాకారులు బౌలింగ్‌లోనూ, బ్యాటింగ్‌లోనూ ప్రతిభ కనబరుస్తున్నారు. ఘట్‌కేసర్ రాంపల్లిలోని త్యాగి మైదానంలో హైదరాబాద్ బ్లూస్ క్లబ్ జట్టుతో నిర్వహించిన మ్యాచ్‌లో రెండో రోజు బుధవారం బ్యాటింగ్‌కు దిగిన బ్లూస్ క్లబ్ జట్టు 37.4 ఓవర్లలో 10వికెట్ల నష్టానికి 96 పరుగులు చేసింది. జిల్లా జట్టు నుంచి టి.అరుణ్ 18.1ఓవర్లలో 42 పరుగులిచ్చి 6 వికెట్లు తీశాడు. గణేశ్ 8ఓవర్లలో 17 పరుగులిచ్చి 2వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన మహబూబ్‌నగర్ జట్టు 75 ఓవర్లు ఆడి ఏడు వికెట్ల నష్టానికి 181 పరుగులు చేసింది. ఏ.శ్రీకాంత్ 65 పరుగులు, మహ్మద్ షాదాబ్ 24పరుగులు చేసి ఔటయ్యారు. ఆట ముగిసే సమయానికి కొండా శ్రీకాంత్ 20 నాటౌట్, టి.అరుణ్ 15 నాటౌట్‌గా ఉన్నారు. లీగ్ టోర్నీలో ఆకట్టుకున్న జిల్లా క్రీడాకారులను ఎండీసీఏ ప్రధాన కార్యదర్శి ఎం.రాజశేఖర్, డీవైఎస్‌వో శ్రీనివాస్, జిల్లా క్రీడాకారులు అభినందించారు.

బాల్యవివాహాలతో అనర్థాలు

దామరగిద్ద, జూలై 31: మండలంలోని బాపన్‌పల్లిలో గ్రామస్తులకు స్థానిక పోలీసులు బాల్యవివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై రాజు మాట్లాడుతూ యుక్త వయస్సు రాకుండానే చిన్నపిల్లలకు పెళ్లి చేయడం వల్ల వారికి పుట్టే పిల్లలు మానసిక, శారీరక ఉల్లాసం లేకుండా పుడతారని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్సై అరుణ్, మోనప్ప, బుగ్గప్ప పాల్గొన్నారు.

బీసీ కులగణన చేపట్టాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, జూలై 31: బీసీ కులగణన చేపట్టేందుకు అవసరమైన చర్యలు వేగవంతం చేయాలని బీసీ మేధావుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.ప్రభాకర్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

భూత్పూర్, జూలై 31 : విద్యాభివృద్ధికోసం శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని నోడల్ ఆఫీసర్ సంగీత కోరారు. బుధవారం జెడ్పీహెచ్‌ఎస్‌లో నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేపై శిక్షణా తరగతిని నిర్వహించారు.

కరాటేలో బంగారు పతకాలు

నారాయణపేట టౌన్, జూలై 31: హైదరాబాద్‌లోని ఫలక్‌నుమాలోని రెడ్డి జల సంఘం ఫంక్షన్‌హాల్‌లో ఈనెల 28న 12వ జాతీయ ఓపెన్ కుంగ్ ఫూ, కరాటే చాంపియన్‌షిప్-2024 పోటీలు నిర్వహించారు. పట్టణంలోని సన్‌షైన్ స్కూల్ విద్యార్థులు రాజేశ్వరి, ముకుంద పాల్గొని బంగారు పతకాలు సాధించారు.

ఎంబీబీఎస్ విద్యార్థి అదృశ్యం: కేసు నమోదు

జడ్చర్ల, జూలై 31 : జడ్చర్ల మండలంలోని కోడ్గల్ గ్రామానికి చెందిన బండ్ల రవీందర్(21) సోమవారం అదృశ్యమైనట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు. రవీందర్ సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ చదువుతున్నాడు.కళాశాలకు సెలవు ఉందని 20రోజుల కిందట స్వగ్రామం కోడ్గల్‌కు వచ్చాడు. మంగళవారం తల్లిదండ్రులతో కలిసి తమ వ్యవసాయ పొలానికి వెళ్లాడని, ఆ తర్వాత మధ్యాహ్నం 3.30గంటల ప్రాంతంలో ఇంటికి వెళ్తున్నానని తల్లిదండ్రులకు చెప్పి వెళ్లాడు. రాత్రి 7గంటల సమయంలో ఇంటికి రాగా కుమారుడు కనిపించలేదు. తన సెల్‌ఫోన్‌ను ఇంట్లోనే వదిలి వెళ్లాడు. దీంతో ఎంత వెతికినా ఆచూకీ లేకపోవడంతో ఈ మేరకు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడని సీఐ తెలిపారు. తండ్రి మల్లయ్య ఫిర్యాదు మే రకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ప్రిన్సిపాల్ బదిలీ

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 31: మహబూబ్‌నగర్ జిల్లాలో ఇద్దరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు బదిలీ అయ్యారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ కెప్టెన్ డా.మడుగు విజయ్‌కుమార్ హైదరాబాద్ నారాయణగూడలోని బాబుజగ్జీవన్‌రాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో బీఆర్.అంబేద్కర్ డిగ్రీ కళాశాల పటాన్‌చెరువు ప్రిన్సిపాల్ డా.రాజేంద్రప్రసాద్ రానున్నారు. జడ్చర్ల బీఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డా.అప్పియచిన్నమ్మ హైదరాబాద్‌లోని హుస్సేనీఆలం డిగ్రీకళాశాలకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో హైదరాబాద్ విద్యానగర్ నుంచి సుకన్య బదిలీ అయ్యారు.

ఎన్టీఆర్ పీజీ కళాశాలలో మూడు కొత్త కోర్సులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 31: ఎన్టీఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ మహిళా కళాశాలలో కొత్తగా 3 కోర్సులు ఈఏడాది నుంచి ప్రారంభించనున్నట్లు ప్రిన్సిపల్ డా.ఎం.విజయ్‌కుమార్ తెలిపారు. బుధవారం రిజిస్ట్రార్ మధుసూదన్‌రెడ్డి, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రకిరణ్, వైస్ ప్రిన్సిపాల్ డా.మనెమోని కృష్ణయ్య, సంబంధిత అధికారులు కళాశాలను తనిఖీ చేశారు. పీజీ కళాశాలలో ప్రస్తుతం ఎంఎస్సీ జువాలజీ కోర్సు మాత్రమే అందుబాటులో ఉండగా.. కొత్తగా ఎంఎస్సీ మ్యాథ్స్, ఎంఎస్సీ కెమిస్ట్రీ, ఎంఏ తెలుగు కోర్సులు ప్రారంభించనున్నారు. ఈ ఏడాది పీజీ సెట్ కౌన్సెలింగ్‌లో విద్యార్థుల ప్రవేశాలకు అవకాశం కల్పించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

సీఎంను కలిసిన మంత్రాలయ పీఠాధిపతి

మాట్లాడుతున్న డీసీపీవో ఛాన్సలర్ భాగ్యలక్ష్మి

మక్తల్, జూలై 31: మంత్రాలయ పీఠాధిపతి సుబుదేంద్ర గురువు బుధవారం సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిశారు. స్వామివారి జ్ఞాపికను అందజేసి ఆశీర్వదించారు. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి ఉన్నారు.

చైల్డ్ లేబర్‌పై అవగాహన

మాట్లాడుతున్న డీసీపీవో ఛాన్సలర్ భాగ్యలక్ష్మి

మహబూబ్‌నగర్ అర్బన్, జూలై 31: జిల్లా కేంద్రంలోని వెంకటేశ్వర కాలనీ గెలాక్సీ స్కూల్‌లో జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ ఆధ్వర్యంలో చైల్డ్ లేబర్స్‌పై పిల్లలకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీవో ఛాన్సలర్ భాగ్యలక్ష్మి మాట్లాడారు. కార్యక్రమంలో గిరిజా, శివకుమార్, యాదయ్య పాల్గొన్నారు.

పంచాయతీ రికార్డుల పరిశీలన

మక్తల్, జూలై 31: మండలంలోని సంగంబండ గ్రామ పంచాయతీ రికార్డులను బుధవారం శిక్షణ కలెక్టర్ గరిమా నరుల్ల పరిశీలించారు. అనంతరం సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. పెద్దవాగుపై నిర్మించిన చిట్టెం నర్సిరెడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌పై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎంపీవో రహీమతుద్దీన్, మాజీ ఎంపీటీసీ బలరాంరెడ్డి ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు సహకారం

దేవరకద్ర, జూలై 31 : పేద విద్యార్థుల అభ్యున్నతికి సంపూర్ణ సహకారం అందిస్తామని భారత్ వికాస్ పరిషత్ రాష్ట్ర సలహాదారుడు పాండు రంగం అన్నారు. బుధవారం మండలంలోని లక్ష్మీపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు స్టీల్‌ప్లేట్‌లను పంపిణీ చేశారు. అదేవిదంగా మాజీసర్పంచ్ రాందేవ్‌రెడ్డి పాఠశాలకు రూ.5వేల అందజేశారు.

బ్యాంకుల ఎదుట రైతుల బారులు

బాలానగర్, జూలై 31: రెండోవిడుత రుణమాఫీ కోసం మండలంలోని వివిధ గ్రామాల రైతులు బాలానగర్‌లో బ్యాంకుల ముందు బారులుదీరారు. రెండో విడత రూ.1.50లక్షల వరకు రుణమాఫీ బుధవారం విడుదల చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో రైతులు, మహిళా రైతులు బ్యాంకుల ముందు క్యూ కట్టారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

మక్తల్, జూలై 31: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.గోపాలం అన్నారు. రాష్ట్ర సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.మల్లారెడ్డి ఆదేశాల మేరకు నర్వ మండలం పాతర్చేడ్ జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు బుధవారం 2కిలోమీటర్ల సైక్లింగ్ పోటీలు నిర్వహించారు.

ఆర్టీసీ కార్గో సేవలు ప్రారంభం

ధన్వాడ, జూలై 31: మండల కేంద్రంలో నూతనంగా ఆర్టీసీ పార్సిల్ సర్వీస్ కార్గో కేంద్రాన్ని అధికారులు బుధవారం ప్రారంభించారు.కార్యక్రమంలో బీఆర్‌ఎస్ చీరాల కొండారెడ్డి పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన హెచ్‌ఎంకు సన్మానం

కృష్ణ, జూలై 31: గుడెబల్లూర్ ఎంపీపీఎస్‌లో పనిచేస్తున్న ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎం రాంరెడ్డి బదిలీ అయ్యారు. అలాగే హెచ్‌ఎం వి.రామకృష్ణను ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గణేశ్‌సింగ్, కృష్ణ పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆర్థికసాయం అందించాలి

పాలమూరు, జూలై 31: మన్యంకొండ ఆలయం అభివృద్ధి పనులకు ఆర్థికసాయం అందించేందుకు బుధవారం మన్యంకొండను పర్యవేక్షించేందుకు వచ్చిన టీటీడీ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ అధికారి నందిని, ఉత్తరపల్లి రమాచార్యులకు మన్యంకొండ వ్యవస్థాపక, ధర్మకర్త మధుసూదన్ తన ప్రతిపాదనలు అందజేశారు. కార్యక్రమంలో కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చెడుఆలోచనలు మదిలోకి రానీవ్వొద్దు

దేవరకద్ర రూరల్ (చిన్న చింతకుంట), జూలై 31 : విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి చెడుఆలోచనలు తమ మదిలోకి రానివ్వకూడదని ఎస్సై శేఖర్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలో నూతనంగా ప్రారంభమైన ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనార్థలు వంటి పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

జడ్చర్ల, జూలై 31: మున్సిపాలిటీలోని క్లబ్‌రోడ్డు సమీపంలో గల అయోధ్యనగర్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ సింధూర గణపతి ఆలయ నిర్మిణానికి పట్టణానికి చెందిన హుస్నాబాద్ రాంరెడ్డి రూ.లక్ష విరాళం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

ఎన్‌హెచ్ఏఐ పీడీ రహదారి పరిశీలన

మూసాపేట, జూలై 31 : మండలంలోని జానంపేట జాతీయ రహదారిని బుధవారం ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్‌గుప్తా సందర్శించారు. అండర్‌పాస్ నిర్మాణంలో మార్పు చేయాలని గ్రామస్తులు మంగళవారం ఆయనకు వినతిపత్ర అందజేసిన విషయం తెలిసిందే.

అయితే అందుకు ఆయన బుధవారం గ్రామ జాతీయ రహదారిని సందర్శించారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్ఏఐ అధికారి బాబు, మాజీ ఎంపీటీసీలు కృష్ణయ్య, అంజనేయులు, సుధార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు పంపిణీ

నవాబ్‌పేట, జూలై31: మండలంలోని యన్మన్‌గండ్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆశ్రయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం బ్యాగులు, మ్యాట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ గోపీనాథ్, రాజవర్ధన్, హెచ్‌ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.